క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుడివాడరూరల్: పట్టణంలో రెండవ శనివారాన్ని పురస్కరించుకుని విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని గుడివాడ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడ పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, దీనిని దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు, ఉద్యోగులు తమకు సహకరించాలని ఆయన కోరారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

పమిడిముక్కల: ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అగినపర్రు, పమిడిముక్కల, కపిలేశ్వరపురం గ్రంథపాలకులు బొబ్బా లావణ్య, వెనిగళ్ల ప్రతాప్, సాలార్ షరీఫ్ తెలిపారు. 14న వారోత్సవాల ప్రారంభ సభ, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులపై ఉపన్యాసాలు, 17న కవి సమ్మేళనాలు, 18న విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్, చిత్రలేఖన పోటలు, 19న మహిళా దినోత్సవం, 20న వారోత్సవాల ముగింపు సభ, బహుమతుల ప్రదానోత్సవం జరుగుతాయని తెలియజేశారు.

14న అండర్-14 బాలబాలికల ఖోఖో జట్ల ఎంపిక

గుడివాడరూరల్: ఈనెల 14వ తేదీ అండర్-14 బాలబాలికల ఖోఖో పోటీలకు సంబంధించి జట్లను ఎంపిక చేస్తామని జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మడకా ప్రసాద్, మద్దినేని సత్యప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ మంగళవారం గన్నవరం జెడ్పీ హైస్కూల్‌లో ఉదయం 9 నుంచి అండర్-14 బాలబాలికల ఖోఖో టీంలకు జట్లు ఎంపిక చేస్తారన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2010 తర్వాత జన్మించిన వారై ఉండాలని, వీరి ఎత్తు సెంటీమీటర్లలో, బరువు కేజీల్లో కలిపి మొత్తం 215 పాయింట్లు మించకూడదని తెలిపారు. క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్: 9848245468ను సంప్రదించాలని వారు కోరారు.

బాలలతోనే రేపటి దేశ భవిష్యత్

పామర్రు: నేటి బాలలతోనే రేపటి భవిష్యత్ ముడిపడి ఉన్నదని పామర్రు సీఐ సుభాకర్ అన్నారు. స్థానిక అసీసీ హైస్కూల్‌లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కిండర్ గార్డెన్ చిన్నారులకు పోటీలు, విచిత్ర ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చిన్నారులు చదువుతో పాటుగా ఆటలలో కూడా ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. చిన్నారులకు నిర్వహించిన పలు పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం చిన్నారుల విచిత్ర వేషధారణను తిలకించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ వలసా సెబాస్టియన్, కరస్పాండెంట్ సిస్టర్ మెర్సీ జోసఫ్, పీఈటీ ఎం.గ్లాడిసన్, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగంపై శిక్షణ

మండవల్లి: అల్లినగరంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు ఆధ్వర్యంలో డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ శుక్రవారం ప్రకృతి వ్యవసాయ పొలంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీపీఎం తాతారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం మరింత ముందుకు వెళ్లేందుకు సిబ్బంది కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరబాబు, ఎస్ఎఫ్ఏ హుస్సేన్, అజయ్, మాస్టర్ ట్రైనర్ శోభారాణి, కాంతమ్మ, మండల ఇన్‌చార్జిలు నారాయణ, నాగవిజయ, వెంకటలక్ష్మి, నాలుగు మండలాల ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం పరిశీలన

మండవల్లి: మండవల్లి శ్మశాన వాటికకు వెళ్లే సీసీ రోడ్డు నిర్మాణం సర్పంచ్ మెండా ఝాన్సీ శుక్రవారం పరిశీలించారు. ఉపాధి హామీ నిధులు రూ.5 లక్షలతో రోడ్డు నిర్మిస్తున్నారు. సర్పంచ్ ఝాన్సీ మాట్లాడుతూ గతంలో ఈ రహదారిపై వర్షం కురిసిన సమయంలో ప్రయాణానికి ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. దహన సంస్కారాల సమయంలో పలు సమస్యలు ఎదుర్కొనేవారని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్, వార్డు సభ్యుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజా రక్షణ భేరి సభను జయప్రదం చేయాలి

దేశంలో మహిళలకు ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఐద్వా జిల్లా కార్యదర్శి వి.జ్యోతి అన్నారు. సీపీఎం నిర్వహిస్తున్న ప్రజా రక్షణ భేరి ప్రచార జాత కార్యక్రమం శుక్రవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేయటానికి పూనుకుందని అన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు కొల్లాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రం దేశ సంపదను, వనరులను అదానీ, అంబానీలకు ధారపోస్తోందని అన్నారు. ఈనెల 15న విజయవాడలో జరిగే ప్రజారక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు.

మహిళల జీవితాల్లో క్రాంతి పథం

- మహిళా సాధికారతకు మార్గం
- వైఎస్సార్ క్రాంతిపథం ద్వారా మహిళా సంక్షేమం
- మహిళలు నిర్వహిస్తున్న వ్యాపారాలకు సహకారం

పమిడిముక్కల: వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా మహిళా సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. పొదుపు సంఘాలు, స్త్రీనిధి, బ్యాంకు రుణాలతో మహిళలు వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. వైఎస్సార్ ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా ఆర్థికంగా తోడ్పాటును అందించి..కేబినెట్ నుంచి నామినేటెడ్ వరకూ పదవుల్లో మహిళలకు పెద్దపీట వేసి మహిళా సాధికారతకు మార్గం వేశారు.

మండలంలో 14,975 మంది ద్వాక్రా సభ్యులు...

మండలంలోని 25 గ్రామాల్లో 1331 స్వయం సహాయక, 49 గ్రామ సంఘాలు ఉన్నాయి. వీటిలో 14,975 మంది సభ్యులు ఉన్నారు. 2019-20లో 785 గ్రూపులకు రూ.33.37 కోట్లు, 2020-21లో 1049 గ్రూపులకు రూ.28.65 కోట్లు, 2021-22లో 855 గ్రూపులకు రూ.60.98 కోట్లు, 2022-23లో 1020 గ్రూపులకు రూ.67.71 కోట్లు, 2023-2024 సంవత్సరానికి గాను 137 గ్రూపులకు రూ.10.26 కోట్లు లింకేజీ రుణాలుగా అందజేశారు. వైఎస్సార్ సున్నా వడ్డీ కింద 2019-20లో 1104 గ్రూపులకు రూ.92 లక్షలు, 2020-21లో 1156 గ్రూపులకు రూ.85 లక్షలు, 2021-22లో 1215 గ్రూపులకు కోటి 10 వేలు, 2022-23లో 1223 గ్రూపులకు రూ.1.64 కోట్లు అందజేశారు.

స్త్రీనిధి రుణాలు..

2019-20లో 329 గ్రూపులకు రూ.4.14 కోట్లు, 2020-21లో 298 గ్రూపులకు రూ.4.83 కోట్లు, 2021-22లో 622 గ్రూపులకు రూ.5.27 కోట్లు, 2022-23లో 461 గ్రూపులకు రూ.4.34 కోట్లు, 2023-24లో 171 గ్రూపులకు రూ.3.45 కోట్లు అందజేశారు. వైఎస్సార్ ఆసరా కింద మొదటి విడత 1100 గ్రూపుల్లోని 11,603 మందికి రూ.10.70 కోట్లు, 1102 గ్రూపుల్లోని 11,623 మందికి రెండో విడత రూ.10.73 కోట్లు, 1102 గ్రూపుల్లోని 11,623 మందికి మూడో విడతగా రూ.10.71 కోట్లు పంపిణీ చేశారు.



కొనగాల లక్ష్మి, హనుమంతపురం, స్వీట్స్ దుకాణం

జగనన్న తోడు...

జగనన్న తోడు కింద 2020-21లో 541 మందికి రూ.54.10 లక్షలు, 2021-22లో 542 మందికి రూ.54.20 లక్షలు, 2022-23లో 1190 మందికి రూ.1.19 కోట్లు అందజేశారు. వైఎస్సార్ చేయూత కింద కిరాణా షాపులకు 51 మందికి రూ.28.68 లక్షలు అందజేశారు, వైఎస్సార్ హౌసింగ్ కింద సొంత స్థలాల్లోని 164 మందికి, లేఅవుట్‌లలోని 1479 మందికి కలిపి మొత్తం 1643 మందికి రూ.5.75 కోట్లు, వైఎస్సార్ చేయూత కింద 2020-21లో 3409 మంది లబ్ధిదారులకు రూ.6.39 లక్షలు, 2021-22లో 3446 మందికి రూ.6.46 లక్షలు, 2022-23లో 3629 మందికి రూ.6.80 లక్షలు చొప్పున అందజేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధి

ప్రభుత్వం అందించే సహకారంతో మహిళలు అప్పడాలు, వడియాలు, పచ్చళ్లు, కిరాణా షాపులు, స్వీట్ దుకాణాలు, కారం మిల్లులు పెట్టుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. ఏపీఎం వసంతరావు ఆధ్వర్యంలో సీసీలు విజయలక్ష్మి, రత్నకుమారి, రత్నమేరియం, ప్రభావతి గ్రామాలకు వెళ్లి మహిళలకు పొదుపు గ్రూపుల ఏర్పాటు, వ్యాపారాల ఏర్పాటుకు సూచనలు, సలహాలు అందజేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలకు వడ్డీలేని రుణాలు, స్త్రీనిధి రుణాలు, చిరువ్యాపారులకు జగనన్న తోడు కింద రుణాలు ఇప్పిస్తున్నారు.



పూషాడపు విజయలక్ష్మి, కపిలేశ్వరపురం, ఫ్యాన్సీ షాపు

మహిళా సంక్షేమమే ధ్యేయం



మహిళా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోంది. మహిళల ఆర్థికాభివృద్ధికి సహకారం అందిస్తోంది. మహిళలు వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనేది ప్రభుత్వ ఆలోచన. మహిళలు ముందుకువచ్చి వ్యాపారాలు పెట్టుకోవాలని సూచిస్తున్నాం.

– వసంతరావు, ఏపీఎం

సంక్షేమ పథకాలపై ప్రజలను చైతన్యం చేస్తాం

- ఏపీకి జగనన్నే ఎందుకు కావాలో ప్రజలకు తెలియజేస్తాం
- ఎంపీపీ గద్దే పుష్పరాణి

గుడివాడరూరల్: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి అర్థమయ్యే విధంగా వివరించి చైతన్యవంతం చేస్తామని ఎంపీపీ గద్దే పుష్పరాణి అన్నారు. మండల పరిధిలోని బిళ్లపాడు సచివాలయం వద్ద ఏపీకి జగనన్నే ఎందుకు కావాలని అనే కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలసి శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బిళ్లపాడు సచివాలయం పరిధిలో ఇప్పటివరకు 6571 మంది రూ.20,67,50,289 కోట్లు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ(డీబీటీ) కింద లబ్ధిపొందారని, మరో 2781మంది రూ.8,97,87,041కోట్లు పరోక్ష ప్రయోజనాలు(నాన్ డీబీటీ) లబ్ధి పొందారని వెరసి మొత్తం రూ.29,65,37,330 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని స్పష్టం చేశారు. పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో మరోసారి అవకాశం కల్పిస్తే ఇంతకు మించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తారని అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజల వద్దకు తీసుకువెళ్లి వారికి వివరించి జగనన్నే ఎందుకు కావాలనే విషయాలను స్పష్టంగా తెలియచేయాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను గ్రామస్తులకు అందజేసి వారికి అర్థమయ్యే విధంగా తెలియపర్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భట్టు నాగమల్లేశ్వరి, గుంజా వంశీధర్, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ చుక్కా నాగలక్ష్మి, మండల సచివాలయాల కన్వీనర్ కారే జోసఫ్, వైఎస్సార్‌సీపీ నాయకులు గద్దే వెంకట రామాంజనేయులు(రాము), వి.చిట్టిబాబు, జోగి సోములు, కళ్లేపల్లి పవన్, సింగవరపు సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



బిళ్లపాడులో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందచేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కళలను, కళాకారులను గౌరవించాలి

పామర్రు: అంతరించి పోతున్న కళలను, కళాకారులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని పామర్రు ఘంటసాల కళా పీఠం అధ్యక్ష, కార్యదర్శులు కాటూరి వెంకట మురళీ కృష్ణ, దగ్గుమిల్లి హరికృష్ణ అన్నారు. స్థానిక అంకమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులకు పాటల పోటీలను శుక్రవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు జూనియర్స్‌గా, 8, 9, 10 తరగతుల విద్యార్థులను సీనియర్స్‌గా విభజించి పోటీలను నిర్వహించామని అన్నారు. మండల స్థాయిలో జరిగిన ఈ పోటీలలో మండలంలోని అన్ని పాఠశాలల నుంచి సుమారు 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో జూనియర్స్ విభాగంలో ఎ.నిఖితశ్రీ , వంశీ సమీర్, రూతమ్మ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారు. సీనియర్స్ విభాగంలో జి.ప్రసన్న, కె.సిరి, ఎస్.దుర్గా భవాని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించి బహుమతులను ప్రశంసా పత్రాలను అందుకున్నారన్నారు. కార్యక్రమంలో కళా పీఠం గౌరవ అధ్యక్షుడు కోటి పాండురంగారావు, సభ్యులు వై.రాంబాబు, రఘుశర్మ, బాపట్ల నాగేశ్వరరావు, బి.రామకృష్ణారెడ్డి, కొల్లాబత్తుల సాల్మన్ రాజు, మల్లేశ్వరమ్మ, సుబ్బమ్మ, ఎస్.త్రినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న కళాపీఠం అధ్యక్ష కార్యదర్శులు మురళీకృష్ణ, హరికృష్ణ

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం

ముదినేపల్లి రూరల్: రాష్ట్రం సమగ్రాభివృద్ధి ముఖ్యమంత్రి జగనన్న వల్లే సాధ్యపడుతుందని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు దూలం వీర శ్యాంఫణికుమార్ అన్నారు. మండలంలోని అల్లూరులో ఏపీకి జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ రాజకీయ పదవుల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఇతర రంగాల్లో మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని గుర్తించి ముఖ్యమంత్రిని ఆశీర్వదించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తొలుత గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండా దిమ్మ వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బ్రోచర్లను అందజేశారు.



అల్లూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ

14 నుంచి కార్తిక మాసోత్సవాలు

ముదినేపల్లి రూరల్: పార్వతీసమేత సోమేశ్వర స్వామి ఆలయంలో 14 నుంచి కార్తిక మాసోత్సవాలు ప్రారంభిస్తామని ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, చైర్మన్ గుళ్లపల్లి సుధారాణి తెలిపారు. కార్తికమాసం సందర్భంగా పలు పర్వదినాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 17న నాగుల చవితి, 26న పౌర్ణమి జ్వాలాతోరణం, 27న పౌర్ణమి కార్తిక నోములు, కేదారేశ్వర నోములు, 30న ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన, వచ్చే నెల 10న నందీశ్వరస్వామికి అభిషేకం, 13న పోలిని స్వర్గానికి పంపించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

పులపర్రులో శ్మశానవాటిక సమస్యకు పరిష్కారం

మండవల్లి: కొల్లేటి గ్రామం పులపర్రులో శ్మశాన వాటిక సమస్యకు ఎమ్మెల్సీ పరిష్కారం చూపారు. పులపర్రులో శ్మశాన వాటికకు దారి లేక మృతదేహాలను కొల్లేరు నుంచి పడవపై శ్మశాన వాటికకు తీసుకువెళ్లి గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఈ విషయం తెలిసిన ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ శుక్రవారం గ్రామానికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్మశాన వాటిక సమస్య అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.



పులపర్రులో శ్మశాన వాటిక సమస్యపై గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

సంక్షిప్తం

సౌత్‌ఇండియా బాస్కెట్‌బాల్ పోటీలకు ఎఎస్ఆర్ విద్యార్థి ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థి వర్ధన్‌తో ప్రిన్సిపాల్, పాలకవర్గ సభ్యులు

గుడివాడరూరల్: సౌత్ ఇండియా స్థాయిలో నిర్వహించనున్న బాస్కెట్ బాల్ పోటీలకు గుడివాడ ఏఎస్ఆర్ కళాశాల బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థి ఎస్.వర్ధన్ ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్ తెలిపారు. స్థానిక ఏఎస్ఆర్ కళాశాలలో శుక్రవారం పోటీలకు ఎంపికైన విద్యార్థి వర్ధన్‌ను కళాశాల పాలకవర్గం, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 7, 8 తేదీల్లో కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారని, ఈ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి వర్ధన్ ప్రథమ సంవత్సరం బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో అత్యధిక ప్రతిభ కనబర్చి కృష్ణా యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ టీంకు అర్హత సాధించారన్నారు. కృష్ణా యూనివర్సిటీ తరపున ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలో జరగనున్న బాస్కెట్‌బాల్ పోటీలకు యూనివర్సిటీ తరపున వర్ధన్ ఎంపి కవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ ప్రెసిడెంట్ ఎల్ఆర్‌కే ప్రసాద్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేఏస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, పీజీ లైబ్రేరియన్ బీఎస్ఎస్ పద్మజ, ఫిజికల్ డైరెక్టర్ వీర్ల గోపి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

గుడివాడరూరల్: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ అన్నారు. నందివాడలో శుక్రవారం ఏపీకి జగనన్నే ఎందుకు కావాలి, పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శశిభూషణ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసేందుకు ఇప్పటి నుంచి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీపీ పెయ్యల ఆదాం మాట్లాడుతూ నందివాడ గ్రామ అభివృద్ధికి, ప్రత్యక్ష, పరోక్ష నగదు బదిలీలకు రూ.24 కోట్లు ఖర్చు చేశామని, దీని ద్వారా 1086 మంది లబ్ధి పొందారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పూడి సుధాకర్, సర్పంచ్ సరెళ్ల రత్నకుమారి, మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కందుల నాగరాజు, మండల సచివాలయ కన్వీనర్ దేశిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు మలిరెడ్డి రవీంద్రరెడ్డి, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శిక్షణ

మండవల్లి: మండవల్లి వ్యవసాయశాఖ కార్యాలయంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి మాట్లాడుతూ గ్రేడ్ ఏ రకం క్వింటాల్‌కి రూ.2,203, సాధారణ రకం రూ.2,183 ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, సివిల్ సప్లయిస్ టెక్నికల్ అసిస్టెంట్ రాజు, డీసీఎంఎస్ విజయ్, వీఆర్వోలు, వీఏఏలు, ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ పథకాలపై ఇంటింటా ప్రచారం

కైకలూరు: రాష్ట్రానికి మళ్లీ తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎంపీపీ అడవి కృష్ణ చెప్పారు. ఆటపాక సచివాలయం పరిధిలో శుక్రవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక బుక్‌లెట్‌ను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తలారి జాన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భట్రాజు శివాజీ, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, జిల్లా ఎస్సీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కూనవరపు సతీష్, సచివాలయ కన్వీనర్ కుమ్మరికుంట మదన్, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి జగనే కావాలి



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ

మండవల్లి: రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించి, పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం పీఠం అధిరోహించాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. మండవల్లి మండలం తక్కెళ్ళపాడులో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం ఎమ్మెల్యే డీఎన్నార్ తనయుడు దూలం ఆదివినయ్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీహెచ్ పూర్ణమ్మ, డి.మోషే, కె.మోషే, డి.ప్రసాద్, సీహెచ్ రత్నకుమారి, సీహెచ్ ఏసుపాదం, ఎ.చంటి, బి.దయశాలి, ఝాన్సీరాణి తదితరులను పార్టీ కండువా కప్పి ఎమ్మెల్సీ జయమంగళ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు సయ్యపురాజు గుర్రాజు, వైస్ ఎంపీపీ మల్లాది ఆదివిష్ణు, సర్పంచ్ చేబ్రోలు సుధారాణి, బలే నాగరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, రాష్ట్ర బీసీ నాయకులు చేబోయిన వీర్రాజు, ముంగర మల్లికార్జునరావు, గోకర్ణయాదవ్, మెండా సురేష్ పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కైకలూరు: యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆలపాడు బ్రాంచి మేనేజరు కె.దివ్య అన్నారు. బ్యాంకు ప్రారంభించి 105 ఏళ్లు నిండిన సందర్భంగా శుక్రవారం కార్యాలయంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు కొప్పుల ఏడుకొండలు, జంగం విజయ్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ సుబ్బారావు మృతి

కలిదిండి: కోట కలిదిండి గ్రామానికి చెందిన దస్తావేజు లేఖరి అడవి వెంకట సుబ్బారావు (68) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. కైకలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు లేఖరిగా 40 ఏళ్లుగా పనిచేస్తున్నారు. సుబ్బారావు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

వ్యాపార వ్యవహారాల్లో అకౌంటింగ్ పాత్ర కీలకం

కైకలూరు: అంతర్జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ బీవీ రావును సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రఘునాథరెడ్డి, కామర్స్ విభాగం ఇన్‌చార్జి నున్న శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా జగనన్న ప్రభుత్వం

కలిదిండి: సంక్షేమ పథకాల అమలు పారదర్శకంగా వ్యవహరిస్తూ, జగనన్న ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. భాస్కరరావుపేటలో ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జయమంగళ మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా భాస్కరరావుపేట గ్రామ ప్రజలు రూ.16.79 కోట్లు లబ్ధి పొందారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు కుమారుడు వినయ్, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ నాయకులు సయ్యపరాజు గుర్రాజు, ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీ కూసంపూడి కనక దుర్గారాణి, సర్పంచ్ గద్దె ఆనంద్ కుమార్, ఎంపీటీసీ చావాకుల పద్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్ పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద తనిఖీ

కలిదిండి: ఆరుతెగలపాడు హైస్కూల్లో విద్యార్థులకు అందిస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని ఎంఈఓ పి.ప్రభాకరరావు, ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు ఎ.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై సమన్వయ సమావేశం

మొవ్వ: ధాన్యం కొనుగోలులో దళారులకు, మధ్యవర్తులకు తావు లేకుండా మిల్ ర్యాండమైజేషన్ పద్ధతిలో మిల్లులకు ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరుగుతుందని, ఎట్టి పరిస్థితుల్లో రైతులు మిల్లుకు వెళ్లవలసిన అవసరం లేకుండా ఈ ప్రక్రియ జరుగుతుందని మొవ్వ తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ తెలిపారు. ఖరీఫ్ వరిపంట ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సంసిద్ధత, సమన్వయ సమావేశాన్ని శుక్రవారం మొవ్వ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పీఏసీఎస్ సెక్రటరీలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, వ్యవసాయ సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, వీఆర్‌వోలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ధాన్యం కొనుగోలుకి అవసరమైన గోనుసంచులు సకాలంలో సమృద్ధిగా ఉండే విధంగా ఉంచాలని సూచించారు.కార్యక్రమంలో ఏడీఏ ఎస్.శ్యామల, ఏవో కె.శివప్రసాద్, కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ రాజ రవి గోపాల్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎం.రత్నగిరి పాల్గొన్నారు.

డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఎలకుర్రు(పామర్రు): నాబార్డు సౌజన్యంతో మండలంలోని ఎలకుర్రు గ్రామంలో శుక్రవారం డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం స్థానిక పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ అధ్యక్షుడు కాశీనాధుని నాగేశ్వరరావు మాట్లాడుతూ కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం కళాజాత నిర్వహించారన్నారు.